సాక్షి
కర్నూలు
సోమవారం ၊ 5 ၊ ఫిబ్రవరి ၊ 2024



కేసీ కాల్వకు నీటి విడుదల

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు ఆదివారం 159 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. డ్యాంలో 0.398 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



మల్లన్నకు నృత్యనీరాజనం

శ్రీశైలం టెంపుల్: నిత్యకళావేదికపై ఆదివారం కృష్ణా జిల్లాకు చెందిన బాల త్రిపుర సుందరి నృత్య కళా నిలయం, సాయి మంజీరా కూచిపూడి ఆర్ట్ అకాడమీ వారి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.



శాస్త్రోక్తంగా పల్లకీ సేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల ఉత్సవమూర్తులకు ఆదివారం శాస్త్రోక్తంగా పల్లకీ సేవ నిర్వహించారు. పల్లకీలో ఉత్సవమూర్తులతో ఆలయ ప్రదక్షిణ చేశారు.

న్యూస్‌రీల్

ఫైబర్‌నెట్ ద్వారా రూ.190కే ఇంటర్నెట్



మాట్లాడుతున్న ఎంపీ శ్రీకాంత్‌రెడ్డి

కర్నూలు(సెంట్రల్): ఏపీ ఫైబర్ నెట్ ద్వారా నెలకు రూ.190కే ఇంటర్నెట్ సేవలు అందుతాయని ఏపీ ఫైబర్ నెట్ జిల్లా మేనేజర్ ఎంపీ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఆదివారం కలెక్టరేట్‌లో కేబుల్ ఆపరేటర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రతి గ్రామ పంచాయతీలో ఫైబర్ నెట్ సేవలను వినియోగించుకోవడానికి ఓల్ట్‌లు పెట్టినట్లు చెప్పారు. వీటి ద్వారా రూ.190కే ఇంటర్నెట్ సేవలను అందిస్తామన్నారు. కాగా, ఆరు నెలల ప్యాకేజీ రీచార్జ్ చేసుకుంటే ఏడు నెలలు, 12 నెలలు ప్యాకేజీ రీచార్జ్ చేసుకుంటే 14 నెలల పాటు సేవలు అందుతాయన్నారు. కార్యక్రమంలో ఎస్.ధనుంజయ, రవికిశోర్, అశోక్, అన్వర్‌బాషా, ఝాన్సీ పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో 'స్పందన'

కర్నూలు(సెంట్రల్): కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతోపాటు అన్ని మండల, డివిజన్, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా స్పందన కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

98 శాతం పింఛన్ల పంపిణీ

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో ఆదివారం సాయంత్రం 6 గంటల సమయానికి 98.08 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయ్యింది. మొత్తం 2,48,329 మంది లబ్ధిదారులు ఉండగా 2,43,465 మందికి వైఎస్సార్ పెన్షన్ కానుక అందజేశారు. ఇంతవరకు పింఛన్లు పొందని వారు సోమవారం సంబంధిత వార్డు, గ్రామ వెల్ఫేర్ అసిస్టెంటు, వలంటీరు ద్వారా తీసుకోవచ్చని డీఆర్‌డీఏ-వైకేపీ పీడీ సలీమ్‌బాషా ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పింఛన్ల పంపిణీలో కర్నూలు జిల్లా రాష్ట్రంలో నాలుగో స్థానంలో నిలిచింది.

పరీక్ష ఫీజు చెల్లింపునకు మరో అవకాశం

కర్నూలు సిటీ: ఇంటర్మీడియట్ పరీక్ష ఫీజు చెల్లించేందుకు అధికారులు మరో అవకాశాన్ని కల్పించారు. తాత్కాల్ స్కీమ్ కింద రూ.3 వేల అపరాధ రుసుంతో ఈ నెల 10వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు ఆయా కళాశాలల్లో చెల్లించవచ్చు. ఈ మేరకు ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ కార్యాలయ అధికారి గురవయ్య శెట్టి ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇంకా ఎవరైనా ఫీజు చెల్లించలేకపోతే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఈ-కేవైసీకి 15 వరకు గడువు

కర్నూలు(అగ్రికల్చర్): ఈ క్రాప్‌లో నమోదైన రబీ పంటలకు సంబంధించి ఈకేవైసీ చేయించుకునేందుకు ఈనెల 15 వరకు గడువు ఉంది. రబీ సాధారణ విస్తీర్ణం 2,56,364 ఎకరాలు ఉండగా, 2,21,212 ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. ఇప్పటి వరకు 2,26,671 ఎకరాల్లో సాగు చేసిన పంటలను రైతు భరోసా కేంద్రాల ఇన్‌చార్జ్‌లు ఈ క్రాప్‌లో నమోదు చేశారు. నమోదు చేసిన పంటలను రైతులు కూడా ఈ-కేవైసీతో ధ్రువీకరించాల్సి ఉంది. ఇప్పటి వరకు 42,362 మంది రైతులు 1,42,726 ఎకరాల్లో సాగు చేసిన పంటలను ఈ-కేవైసీతో ధ్రువీకరించారు.

శ్రీశైలంలో భక్తుల రద్దీ



క్యూలైన్లలో బారులు తీరిన భక్తులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో వారాంతపు రద్దీ నెలకొంది. ఆదివారం ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి సైతం భక్తులు వేలాదిగా తరలివచ్చారు. వేకువజామునే పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు మల్లన్న దర్శనానికి క్యూలైన్ వద్దకు చేరుకున్నారు. పలువురు భక్తులు మల్లన్నకు గర్భాలయ, సామూహిక అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా దేవస్థాన అధికారులు పలు ఏర్పాట్లు చేశారు. ఉచిత కంపార్ట్‌మెంట్లలో వేచి ఉన్న భక్తులకు తాగునీరు, అల్పాహారం, బిస్కెట్లు పంపిణీ చేశారు. భక్తుల శివ నామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. భక్తుల రద్దీతో క్షేత్ర పురవీధులన్నీ కిటకిటలాడాయి.

ఇంటికే వచ్చిన సంక్షేమం

- ఐదేళ్లుగా ప్రజలకు తప్పిన ప్రయాసలు
- తలుపుతట్టి ప్రభుత్వ పథకాల అందజేత
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో విప్లవాత్మక మార్పులు
- దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా విస్తృతంగా సంక్షేమ పథకాలు
- పాదయాత్రలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేసిన సీఎం వైఎస్ జగన్

కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు.. అధికారులను ప్రాధేయపడాల్సిన పనీ లేదు.. రాజకీయ నాయకుల సిఫార్సులతో సంబంధం లేదు.. అర్హత ఉంటే చాలు.. ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు వస్తున్నాయి. అవి కూడా ఒకటీ రెండూ కాదు.. పదుల సంఖ్యలో.. అవినీతి రహితంగా అందుతున్నాయి. ప్రజల జీవన ప్రమాణాలు పెంచడమే లక్ష్యంగా, పేదరిక నిర్మూలనే ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకున్న చరిత్రాత్మక మార్పు ఇది.



ఇంటివద్దనే ఎండీయూ వాహనం ద్వారా రేషన్ అందిస్తున్న దృశ్యం

కర్నూలు(సెంట్రల్): గుడిసెలో జీవనం.. ప్రతి రోజూ పనిచేస్తేనే కుటుంబం గడవడం..పైసాపైసా కూడబెట్టుకున్నా మెరుగవ్వని జీవితం..ఇలాంటి వారికి ప్రభుత్వాలు ఏం చేయాలి? ఆర్థికంగా ఆదుకోవాలి.. వివిధ పథకాల ద్వారా వారి సామాజిక స్థితిని మెరుగు పర్చాలి. అయితే గత ప్రభుత్వాలు పథకాల అమలుకు ఎన్నో నిబంధనలు అమలు చేసేవి. దళారుల ప్రమేయం ఎక్కువగా ఉండేది. అర్హులకు కాకుండా డబ్బులు ఇచ్చిన వారికి పథకాలు అందేవి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎంతో మార్పు వచ్చింది. పథకాలన్నీ పారదర్శకంగా అమలు చేసేందుకు నిబంధనలు సడలించింది. పేద ప్రజల ప్రయాసలు తొలగిస్తూ, వారికి విలువైన కాలాన్ని అందిస్తూ ఇంటి వద్దకే ప్రభుత్వ పథకాలు వచ్చే ఏర్పాట్లు చేసింది.

ఇళ్లిళ్లు తిరిగి సర్టిఫికెట్ల అందజేత

గతంలో కులం, ఆదాయం, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు, రేషన్ కార్డులు, ఆరోగ్యశ్రీ కార్డులు పొందాలంటే నెలల తరబడి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. అధికారులకు లంచం ఇస్తేగాని సర్టిఫికెట్ వచ్చేది కాదు. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమం పేరుతో అత్యంత ముఖ్యమైన 16 రకాల సర్టిఫికెట్లను లబ్ధిదారులకు ఇంటి వద్దనే అందజేసే ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమంలో భాగంగా వలంటీర్లు, రెవెన్యూ అధికారులు ఇళ్లిళ్లు తిరిగి ప్రజలకు కావాల్సిన సర్టిఫికెట్ల కోసం అర్జీలు స్వీకరించి, ప్రభుత్వం నుంచి వచ్చిన సర్టిఫికెట్లను ఇళ్లకే తీసుకెళ్లి ఇచ్చారు. జిల్లాలో దాదాపు 4 లక్షల సర్టిఫికెట్లను ప్రజలకు అందించారు.

ఆరోగ్య సురక్ష

టీడీపీ హయాంలో పెద్దాసుపత్రుల్లో సైతం రోగ నిర్ధార పరీక్షలు సరిగ్గా జరిగేవి కాదు. పేదలు ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లి స్కానింగ్‌లు, ఎక్సరేలు తీయించుకోవాల్సి వచ్చేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు నిర్వహించి.. ప్రజలకు ఉచితంగా బీపీ, షుగర్, ఈసీజీ తదితర పరీక్షలను చేసి మందులను పంపిణీ చేసింది. జిల్లాలోని 672 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో క్యాంపులను నిర్వహించి దాదాపు 4 లక్షల మంది పేదలకు ఉచితంగా వైద్యం అందించింది. ఆయా క్యాంపుల్లో గుర్తించిన రోగులకు ఆరోగ్యశ్రీ ద్వారా మెరుగైన వైద్యం చేయించేందుకు ఏర్పాట్లు చేశారు. జనవరి 1 నుంచి రెండో విడత జగనన్న ఆరోగ్యసురక్ష క్యాంపులు నిర్వహిస్తున్నారు. ప్రతి మండలంలో ఈ క్యాంపులు జరుగుతున్నాయి.



కర్నూలులో ఇంటికే వెళ్లి వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న వలంటీరు

మురి'పింఛన్'

టీడీపీ హయాంలో వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు పింఛన్లు పొందాలంటే పంచాయతీ కార్యాలయం దగ్గర రోజుల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి ఉండేది. ఎవరైనా చనిపోతేనే అర్హత ఉన్న వారికి పింఛన్ దక్కేది. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక వలంటీర్ల ద్వారా ప్రతి నెలా ఒకటో తేదీనే ఇంటి వద్దనే పింఛన్లు అందిస్తున్నారు. అర్హతే ప్రామాణికంగా ఎవరి సిఫార్సులు లేకుండా లబ్ధిదారుల ఎంపిక జరుగుతోంది. జిల్లాలో 2,48,905 మంది లబ్ధిదారులు ఉండగా ప్రభుత్వం ప్రతి నెలా రూ. 74.53 కోట్లను అందజేస్తోంది.



ఫ్యామిలీ ఫిజిషియన్ విధానంలో ఇంటి దగ్గరకే వెళ్లి చికిత్స చేస్తున్న వైద్యుడు

ఫ్యామిలీ డాక్టర్

గతంలో రోగమొస్తే పల్లె ప్రజలు పట్టణాలకు వెళ్లేవారు. వేల రూపాయలు ఖర్చు పెట్టుకుని జబ్బును నయం చేసుకునే వారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం డాక్టరే పేదల ప్రజల ఇంటి వద్దకు వస్తున్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానంతో 104 సంచార వాహనాల ద్వారా వైద్యాధికారి, సిబ్బంది రోగుల ఇళ్లకే వెళ్లి సేవలు అందిస్తున్నారు. ప్రతి నెలలో గ్రామ సచివాలయ పరిధిలో రెండు రోజుల పాటు వీరు పర్యటిస్తున్నారు. మొత్తం 12 రకాల ఆరోగ్య సేవలు అందిస్తున్నారు. జిల్లాలో ఏడాది కాలంలో 2.79 లక్షల మందికి ఫ్యామిలీ ఫిజిషియన్ విధానంలో వైద్యసేవలు అందాయి.



గర్భిణులకు ఇంటికే వెళ్లి టేక్ హోం రేషన్‌ను అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

'పోషణ' బాధ్యత

టీడీపీ హయాంలో మాతాశిశు మరణాలు ఎక్కువగా ఉండేవి. అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నా సరైన పోషకాహారం అందేది కాదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆరేళ్లలోపు చిన్నారులు, బాలింతలు, గర్భిణుల్లో పోషకాహార లోపాన్ని నివారించేందుకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ్ పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకంలో భాగంగా బెల్లంతో తయారు చేసిన చెక్కీలు, గుడ్లు, పాలు, బాలామృతం, రేషన్, బ్యాళ్లు, నూనె ఇతర ఆహార పదార్థాలను టేక్ హోం పేరిట కిట్లను తయారు చేసి జిల్లాలోని 43 వేల మంది మహిళలకు ఇళ్లకే వెళ్లి అందజేస్తున్నారు.



జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులో వైద్య పరీక్షలు నిర్వహించుకుంటున్న పేదప్రజలు

హామీలన్నీ అమలు

టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు 2014 ఎన్నికల ముందు 600 హామీలు ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక టీడీపీ వెబ్‌సైట్‌లో ఉన్న హామీలను తొలగించారు. ఒక్క హామీని కూడా సక్రమంగా అమలు చేయలేకపోయారు. మళ్లీ ఎన్నికలు వస్తున్న తరుణంలో హామీల వర్షం కురిస్తున్నారు. అయితే అందుకు భిన్నంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలన్నీ తన ఐదేళ్లలో 99 శాతం అమలు చేసి చూపించారు. ప్రభుత్వ పథకాలను ఇంటివద్దనే అందిస్తూ రికార్డు సృష్టించారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ ఇలా సంక్షేమ పథకాలు ఇళ్లకు వెళ్లి అందించే ఏర్పాట్లు లేవు. కేవలం ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే విస్తృతంగా సంక్షేమ పథకాలు అమలవుతున్నాయి. ఈ నేపథ్యంలో మరోసారి వైఎస్‌జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిని చేసుకుంటే తమ కుటుంబాలు బాగు పడుతాయని పేదలు, మధ్యతరగతి వర్గాల ప్రజలు భావిస్తున్నారు.

రేషన్..సై'రన్'

టీడీపీ హయాంలో పౌరసరఫరాల శాఖ ద్వారా సరఫరా అవుతున్న బియ్యం పక్కదారి పట్టి పేదలకు అందేది కాదు. డీలర్లు, మధ్యవర్తులు అమ్ముకొని సొమ్ము చేసుకునే వారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక పేదలకు నాణ్యమైన ఫోర్టిఫైడ్ రైస్, గోధుమపిండి, బ్యాళ్లు, చక్కెర..ఎండీయూ వాహనాల ద్వారా సైరన్ కొడుతూ లబ్ధిదారుల ఇళ్ల దగ్గరకే అందిస్తున్నారు. జిల్లాలో 409 వాహనాల ద్వారా 6,34,631 మంది రేషన్ కార్డు దారులకు ప్రతి నెలా 1 నుంచి 16వ తేదీ మధ్య రేషన్ సరుకులను ఎండీయూ వాహనాల ద్వారా అందజేస్తున్నారు.

టీడీపీ హయాంలో స్కీములన్నీ స్కామ్‌లే



నేను ప్రభుత్వ ఉద్యోగిగా 40 ఏళ్లు పనిచేశాను. గతంలో సంక్షేమ పథకాలేవి పేదలకు చేరేవి కావు. టీడీపీ హయాంలో అయితే ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలకే పథకాలు ఇవ్వాలని ఒత్తిడి ఉండేది. స్కీములన్నీ స్కామ్‌లుగా మారేవి. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఎవరూ ఊహించని విధంగా సంక్షేమ పథకాల నేరుగా లబ్ధిదారుల ఇళ్లకే వెళ్లి అందజేస్తున్నారు.
– జయపాల్‌రెడ్డి, రిటైర్డ్ జెడ్పీ సీఈఓ, కర్నూలు

అర్హులకు నేరుగా లబ్ధి



నేను తహసీల్దార్‌గా పని చేసే సమయాల్లో లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందేవికావు. మధ్యవర్తులే సగం కాజేసేవారు. వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం వచ్చాక చాలా మార్పు వచ్చింది. అర్హులకు నేరుగా లబ్ధి జరుగుతోంది. సంక్షేమ పథకాలను ఇళ్ల దగ్గరే వెళ్లి అందిస్తున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పరిపాలన బాగుంది.
–సీటీ అజయ్‌కుమార్, రిటైర్డ్, తహసీల్దార్

పేదరికం తగ్గుతోంది



సచివాలయ, వలంటీరు వ్యవస్థ వచ్చిన తరువాత సంక్షేమ పథకాల్లో అవినీతికి పులిస్టాప్ పడింది. నేరుగా సంక్షేమ పథకాల ఫలాలను పేదల ఇళ్లకే వెళ్లి అందిస్తున్నారు. సంక్షేమ పథకాలతో పేదరికం తగ్గుతోంది. కేంద్ర ప్రభుత్వం నుంచి సరైన ప్రోత్సాహం లేకపోయినా రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అండగా నిలవడం హర్షణీయం.
– డాక్టర్ మన్సూర్ రహమాన్, రిటైర్డ్ ప్రొఫెసర్, కర్నూలు

నీటి ఎద్దడి నివారణకు రూ.14.98 కోట్లు

- ప్రతిపాదనలు పంపిన ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ



బీ నాగేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ

కర్నూలు(అర్బన్): వేసవిలో నీటి ఎద్దడి నివారణకు రూ.రూ.14.98 కోట్లతో ప్రతిపాదనలు పంపినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ పర్యవేక్షక ఇంజినీరు బీ నాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. జిల్లాలోని 21 మండలాలను తీవ్ర కరువు ప్రాంతాలుగా, 2 మండలాలను మధ్యంతర కరువు ప్రాంతాలుగా ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఆయా మండలాల్లోని 169 గ్రామాల్లో నీటిఎద్దడి నివారణకు రూ.14.98 కోట్లు అవసరమవుతాయని జిల్లా కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామన్నారు. ఆయా ప్రాంతాల్లోని 595 చేతి పంపుల్లో డీపెనింగ్, ఫ్లషింగ్ పనులు చేపట్టేందుకు రూ.5.09 కోట్లు, నీటిని రవాణా చేసేందుకు రూ.9.88 కోట్లు అవసరమవుతాయని ప్రతిపాదనలు రూపొందించామన్నారు. గత ఏడాది ఐదు మండలాల్లోని 19 సమస్యాత్మక గ్రామాలకు రెండు నెలల పాటు ట్యాంకర్ల ద్వారా రక్షిత మంచి నీటిని సరఫరా చేసినట్లు చెప్పారు. జిల్లాలోని 32 సీపీడబ్ల్యూఎస్ నీటి పథకాలకు సంబంధించిన 25 సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుల్లో ఇప్పటి వరకు 25 శాతం నుంచి 75 శాతం వరకు నీరు నిల్వ ఉందన్నారు. 19 ఎస్ఎస్ ట్యాంకుల్లో 75 శాతం, 4 ట్యాంకుల్లో 50 నుంచి 75 శాతం, రెండు ట్యాంకుల్లో 25 నుంచి 50 శాతం వరకు నీటి నిల్వలు ఉన్నాయన్నారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా తుంగభద్ర దిగువ కాలువ నీటిని ఆయా ట్యాంకుల్లో స్టోరేజ్ చేయడం వల్ల ఇప్పటి వరకు నీటి నిల్వలు ఉన్నాయన్నారు. వేసవిలో ఎక్కడ కూడా తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపడుతున్నామన్నారు.

'ఆసరా' సంబరాల పూర్తికి చర్యలు

కర్నూలు(అగ్రికల్చర్): వైఎస్ఆర్ ఆసరా సంబరాలను పూర్తి చేసే విధంగా డీఆర్‌డీఏ-వైకేపీ అధికారులు చర్యలు చేపట్టారు. స్వయం సహాయక సంఘాలకు 4వ ఏడాది ఆసరా నిధుల విడుదలను జనవరి 23న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఉరవకొండలో బటన్ నొక్కి విడుదల చేశారు. అదే రోజు నుంచి వైకేపీ సిబ్బంది సమ్మెలోకి వెళ్లడంతో వల్ల ఆసరా సంబరాలు పెండింగ్‌లో పడ్డాయి. ఇప్పటి వరకు 7 మండలాల్లో మాత్రమే సంబరాలు నిర్వహించారు. ఇంకా 18 మండలాల్లో జరగాల్సి ఉంది. ఈ నెల 16న వైఎస్సార్ చేయూత నిధులు విడుదల కానున్నాయి. ఈ లోపు వైఎస్సార్ ఆసరా సంబరాలు పూర్తి చేసే విధంగా డీఆర్‌డీఏ-వైకేపీ అధికారులు కసరత్తు చేస్తున్నారు.

కర్నూలు చేరుకున్న నూతన డీఐజీ

కర్నూలు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జరిగిన బదిలీల్లో భాగంగా జిల్లాకు నియమితులైన కర్నూలు రేంజ్ నూతన డీఐజీ సీహెచ్ విజయరావు కర్నూలుకు చేరుకున్నారు. ఇప్పటి వరకు డీఐజీగా ఉన్న సెంథిల్‌కుమార్‌ను ఏపీ ఆక్టోపస్ డీఐజీగా బదిలీ చేసి కాకినాడ ఏపీఎస్పీ మూడో బెటాలియన్ కమాండెంట్‌గా పని చేస్తున్న విజయరావును కర్నూలు రేంజ్ డీఐజీగా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. కర్నూలు బీ క్యాంప్‌లోని పోలీస్ అతిథి గృహానికి ఆదివారం చేరుకున్న నూతన డీఐజీని ఎస్పీ కృష్ణకాంత్, అడిషనల్ ఎస్పీ నాగరాజు మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకే ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం ఉదయం 9 గంటలకు రేంజ్ కార్యాలయంలో విజయరావు నూతన డీఐజీగా బాధ్యతలు చేపట్టనున్నారు. కర్నూలు డీఎస్పీ విజయశేఖర్ స్పెషల్ బ్రాంచ్ సీఐ నాగరాజు యాదవ్, త్రీ టౌన్ సీఐ మురళీధర్‌రెడ్డి, ఆర్ఐ పోతలరాజు, డీఐజీ కార్యాలయ మేనేజర్ వాసుదేవ్ తదితరులు కూడా నూతన డీఐజీని మర్యాదపూర్వకంగా కలిశారు.



నూతన డీఐజీ విజయ్‌రావుకు పూలబొకే ఇస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

ఇంటర్ ప్రయోగ పరీక్షలకు సర్వం సిద్ధం

- నేటి నుంచి ఈ నెల 20వ తేదీ వరకు నిర్వహణ
- ఉమ్మడి జిల్లాలో 49 కేంద్రాల ఏర్పాటు
- ప్రతి కేంద్రంలో సీసీ కెమెరాలు
- పరీక్ష అయిన తర్వాత అదే రోజున మూల్యాంకనం
- ఏ రోజు మార్కులు ఆ రోజే ఆన్‌లైన్‌లో నమోదు
- నాన్ జంబ్లింగ్ విధానంలో పరీక్షలు



కర్నూలు సిటీ: ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణకు ఇంటర్మీడియట్ బోర్డు అన్ని ఏర్పాట్లు చేసింది. షెడ్యూల్ ప్రకారం సోమవారం నుంచి వొకేషనల్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ నెల 20వ తేదీ వరకు మూడు విడతలుగా నిర్వహించనున్న పరీక్షలకు సిబ్బందిని సైతం నియమించారు. ప్రతి బ్యాచ్‌కి 40 మంది విద్యార్థులు ఉంటారు. జనరల్ విద్యార్థులకు ఈ నెల 11 నుంచి 20వ తేదీ వరకు ప్రాక్టికల్ పరీక్షలు రెండు స్పెల్స్‌లో నిర్వహించనున్నారు. ప్రతి కేంద్రంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, ఇంటర్మీడియట్ ప్రాంతీయ కార్యాలయంతో పాటు కమిషనర్ కార్యాలయంలో లైవ్ ఉండేలా ఏర్పాట్లు చేసి పర్యవేక్షించనున్నారు. ఈ ఏడాది కూడా నాన్ జంబ్లింగ్ విధానంలోనే ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించనున్నారు.

ఆన్‌లైన్‌లో మార్కుల నమోదు

ఇంటర్మీడియట్ పరీక్షలు ఈ ఏడాది కూడా ఉమ్మడి జిల్లాగానే నిర్వహించనున్నారు. ఉమ్మడి జిల్లాలో అన్ని యాజమాన్యాలకు చెందిన జూనియర్ కాలేజీలు 318 ఉన్నాయి. సోమవారం నుంచి మొదలుకానున్న వొకేషనల్ ప్రాక్టికల్ పరీక్షలకు 25 కేంద్రాల్లో కర్నూలు జిల్లాకు చెందిన 3,449 మంది, 24 కేంద్రాల్లో నంద్యాల జిల్లాకి చెందిన 2,318 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. జనరల్ విభాగం ప్రాక్టికల్ పరీక్షలు 158 కేంద్రాల్లో నిర్వహించనున్నారు. మొత్తం 22,123 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇందులో కర్నూలు జిల్లాకి(92 కేంద్రాలు) చెందిన 14,534, నంద్యాల జిల్లాకు(66 కేంద్రాలు) చెందిన 7,589 మంది హాజరుకానున్నారు. ఎంపీసీ గ్రూప్ విద్యార్థులు 14,372(కర్నూలు 9750, నంద్యాల 4622), బైపీసీ గ్రూప్ విద్యార్థులు 7,751(కర్నూలు 4,784, నంద్యాల 2,967) మంది ప్రాక్టికల్ పరీక్షలు రాయనున్నారు. ఏ రోజు జరిగిన పరీక్షకు అదే రోజు మూల్యాంకనం చేసి అదే రోజు సీసీ కెమెరాల నిఘాలోనే ఇంటర్మీడియట్ బోర్డు ఇచ్చే లింక్‌లో మార్కులను నమోదు చేయాలనే ఆదేశాలు వచ్చాయి. కేంద్రాల దగ్గర 144 సెక్షన్ అమలు చేయనున్నారు. పరీక్ష కేంద్రాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని ఇప్పటికే సమన్వయ కమిటీ సమావేశంలో సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణకు ఎలాంటి నిధుల సమస్య తలెత్తకుండా కంటిన్‌జెన్సీ నిధులు కేటాయించారు. వొకేషనల్‌కు ఒక్కో విద్యార్థికి రూ.20 చొప్పున, జనరల్ విద్యార్థికి ఫిజిక్స్, బొటనీలకి రూ.2, జూవాలజీకి రూ.4, కెమిస్ట్రీకి రూ.6చొప్పున కేటాయించారు.

పకడ్బందీ ఏర్పాట్లు

ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేశాం. మొత్తం 207 కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించాం. నాన్ జంబ్లింగ్ విధానంలో పరీక్షలు జరుగనున్నాయి. వొకేషనల్ విద్యార్థులు 5767 మంది, జనరల్ విద్యార్థులు 22,123 మంది పరీక్షలకు హాజరు కానున్నారు. పరీక్ష కేంద్రాల్లోకి సంబంధిత కాలేజీ సిబ్బందిని అనుమతించరు.
– గురవయ్య శెట్టి, ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ కార్యాలయ అధికారి

నేర ప్రవృత్తిని విడనాడాలి



మాట్లాడుతున్న జిల్లా జడ్జి వెంకటనాగ శ్రీనివాసులు

నంద్యాల(వ్యవసాయం): ఖైదీలు నేరప్రవృత్తిని విడిచి సత్ప్రవర్తనతో మెలగాలని జిల్లా లీగల్‌సెల్ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి సీహెచ్ వెంకటనాగ శ్రీనివాసులు అన్నారు. ఆదివారం సబ్‌జైలును తనిఖీ చేశారు. అనంతరం జైలు పరిసరాలు, వంట గదులు, మరుగుదొడ్లు, బాత్‌రూములను పరిశీలించారు. అనంతరం రికార్డులను తనిఖీ చేసి ఖైదీల సంఖ్యను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖైదీలు నేర స్వభావాన్ని విడిచి సమాజంలో నీతి నిజాయితీగా మెలగాలన్నారు. పేదలకు ఉచిత న్యాయసలహాలు, సూచనలు అందించడానికి లీగల్‌సెల్ ముందుంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా సూపరింటెండెంట్ గురుప్రసాద్, సబ్‌జైలు కౌన్సిల్ బాలునాయక్, లీగల్‌సెల్ సిబ్బంది రామచంద్రారెడ్డి, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కోటేష్‌కు అవార్డు



బ్రహ్మానందం నుంచి అవార్డు అందుకుంటున్న కోటేష్

నంద్యాల(అర్బన్): సినీ నటుడు బ్రహ్మానందం నుంచి నంద్యాల ప్రముఖ చిత్రకారుడు చింతలపల్లె కోటేష్ అవార్డు అందుకున్నారు. బ్రహ్మానందం జన్మదినాన్ని పురస్కరించుకొని ఈనెల 1న సాగంటి ఆర్ట్ అకాడమీ వారు నిర్వహించిన బ్రహ్మానందం ఊహాచిత్రం పోటీలు నిర్వహించారు. ఇందులో కోటేష్ ద్వితీయ బహుమతి సాధించారు. చిత్రాన్ని చూసిన బ్రహ్మానందం అద్భుతంగా అభినందించారు. ఈ మేరకు హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో అవార్డు, ప్రశంసా పత్రాన్ని అందించారు.

మదాసి, మదారి కురువలుగా నమోదు చేయాలి

కర్నూలు(సెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణనలో కురుబ/కురువలను మదాసి/మదారి కురువలుగా నమోదు చేయాలని మదాసి/మదారి కురువ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొంబాయి సుధాకర్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ..రాజ్యాంగంలో ఎక్కడా కురువ/కురుమ/కురుబ కులాల ప్రస్తావనలేదన్నారు. కేవలం మదాసి/మదారికురువల ప్రస్తావన ఉందని, అవి ఎస్సీ కుల జాబితాలో ఉన్నాయన్నారు. అయితే దశాబ్దాలుగా తమకు ఎస్సీ కుల సర్టిఫికెట్ ఇవ్వాలని కోరుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదన్నారు.

రోడ్డు ప్రమాదంలో ట్యాంకర్ డ్రైవర్ దుర్మరణం



మృతి చెందిన డ్రైవర్ శ్రీనివాసరెడ్డి

బనగానపల్లె రూరల్: ఇల్లూరు కొత్తపేట గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ట్యాంకర్ డ్రైవర్ దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. వైఎస్సార్ జిల్లా పులివెందులకు చెందిన శ్రీనివాసరెడ్డి(46) ట్యాంకర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మండలంలోని జయజ్యోతి సిమెంట్ పరిశ్రమకు వెళ్తుండగా శనివారం అర్ధరాత్రి ఇల్లూరు కొత్తపేట సమీపంలో ఆగి ఉన్న లారీని గమనించకుండా వెనుక నుంచి ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో శ్రీనివాసరెడ్డి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బనగానపల్లె ఎస్‌ఐ రామిరెడ్డి ప్రమాదస్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం స్థానిక ఏరియా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడికి భార్య సుజాత, ఇద్దరు సంతానం ఉన్నారు.

జిల్లా హాకీ జట్ల ఎంపిక

కర్నూలు (టౌన్): జిల్లా జూనియర్ హాకీ జట్లను ఎంపిక చేసినట్లు హాకీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి దాసరి సుధీర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలికల జట్టుకు అక్షయ, రేచల్ రాణి, రేణుక, నేహారాణి, నేహా తబస్సుం (కర్నూలు), మౌనిక, శ్రీలత, రాధిక, సీమపావని, హిమబిందు, నందిని ఎంపికయ్యారని పేర్కొన్నారు. బాలుర జట్టుకు నాగేంద్ర, రాఖీ, రాజు, అర్పిత్, జాన్, చరణ్, ప్రశాంత్ (కర్నూలు), రామ్‌చరణ్ (ఎమ్మిగనూరు), విశ్వనాథ్ (ఆదోని),అరవింద్, సమీర్, అభినయ్, పృధ్వీ సాయి (నంద్యాల) ఎంపికయ్యారన్నారు. ఈనెల 9 నుంచి 12 వరకు శ్రీకాకుళంలో నిర్వహించనున్న అంతర్ జిల్లాల పోటీల్లో ఈ జట్లు పాల్గొంటాయని పేర్కొన్నారు.

- సామాజిక ఆసుపత్రుల్లో సకల సౌకర్యాలు
- పల్లె ప్రజలకు అందుబాటులోకి వచ్చిన వైద్యం
- అవస్థలు తొలగి.. చేకూరిన స్వస్థత



ఓర్వకల్లులో నూతనంగా నిర్మించిన సీహెచ్‌సీ ఆసుపత్రి భవనం

అపు'రూపం'.. అత్యాధునిక వైద్యం

ఇదీ మార్పు

ఓర్వకల్లు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేదల ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చింది. సామాజిక ఆరోగ్య కేంద్రాలను అన్ని వసతులతో తీర్చిదిద్దింది. పల్లె ప్రాంతాల్లో అత్యాధునిక వైద్య సదుపాయాలు కల్పించింది. అన్ని హంగులతో కూడిన కార్పొరేట్ ఆసుపత్రులను తలదన్నేలా ఆరోగ్య కేంద్రాలకు పరికరాలు అందించింది. దీంతో ఐదేళ్లుగా ప్రజలు పట్టణాలకు వెళ్లే అవస్థలు తొలగాయి. గ్రామీణ ప్రాంతాల్లోనే అత్యాధునిక వైద్యాన్ని అందుకుని స్వస్థత పొందుతున్నారు.

అత్యవసర శస్త్ర చికిత్సలు..

ఓర్వకల్లు ఆసుపత్రిలో శస్త్ర చికిత్సలు అందుబాటులోకి వచ్చాయి. ఇప్పటి వరకు ఇక్కడ 30 మంది గర్భిణులకు సిజేరియన్ ద్వారా ప్రసవాలు చేశారు. అలాగే 150 మందికి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు నిర్వహించారు. ఇక్కడ 100కుపైగానే సాధారణ ప్రసవాలు జరిపినట్లు వైద్యులు పేర్కొంటున్నారు. కార్పొరేట్ ఆసుపత్రుల తరహాలోనే ఇక్కడ అన్ని శస్త్ర చికత్సలకు ఆరోగ్యశ్రీ వర్తిస్తోందని వైద్యులు తెలిపారు. సాధారణ జబ్బులైన బీపీ, షుగర్ పరీక్షలతో పాటు, డెంగు, మలేరియా, రక్త గ్రూపింగ్, హెచ్‌ఐవీ, హెపటైటీస్–బి(కామెర్లు), కాలేయం, మూత్రపిండాలు, గర్భిణీ, హెర్నియా వంటి నిర్ధారణ పరీక్షలు అందుబాటులో ఉన్నాయి. అంతేగాక ఎక్స్‌రే యూనిట్, రక్తనిధి సదుపాయం త్వరలో రానున్నట్లు వైద్యులు తెలిపారు.

ఛాతీ నొప్పికి ఉచిత వైద్యం

అత్యవసర సమయాలలో ఛాతీ నొప్పి సంభవించినపుడు 'స్టెమీ' పద్ధతిలో ఇక్కడ ఉచిత వైద్యం అందిస్తున్నారు. ఒక్కో ఇంక్షన్ రూ.40 వేల ఖరీదు చేస్తుంది. ఓర్వకల్లు ఆసుపత్రిలో రెండు ఖరీదైన ఇంజక్షన్లు సిద్ధంగా ఉంచారు. ఇక్కడ వైద్యం చేయించుకున్న బాధితులను 108 అంబులెన్స్ ద్వారా అత్యవసర విభాగానికి వెళ్లకుండా నేరుగా సంబంధిత వార్డుకు తీసుకెళ్లే వెసులుబాటు కల్గుతుంది.

టీడీపీ హయాంలో ఇలా..

జ్వరమొచ్చినా..జలుబు వచ్చినా స్థానిక ఆరోగ్య కేంద్రానికి వెళ్తే డాక్టర్లు ఉండేవారు కాదు. నర్సులే చూసి ఇంటికి పంపేవారు. జబ్బు నయమయ్యేది కాదు. రోగం ముదిరి పట్టణ ప్రాంతానికి వెళ్లాల్సి వచ్చేది. అక్కడ ప్రైవేట్ ఆసుపత్రుల్లో వేల రూపాయలు ఖర్చు చేస్తే కాని జబ్బు తగ్గేది కాదు. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా అప్పటి ప్రభుత్వంలో చలనం ఉండేది కాదు. ఆసుపత్రుల్లో వైద్య సౌకర్యాలను మెరుగు పరిచేందుకు ఎలాంటి చర్యలు ఉండేవి కాదు.

ప్రస్తుతం ఇలా..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఓర్వకల్లు మండలంలోని హుసేనాపురం, ఓర్వకల్లు ఆసుపత్రులను తీర్చిదిద్దింది. రూ.6.50 కోట్లతో కొత్తగా రెండు ఆసుపత్రి భవనాలను నిర్మించింది. రూ.1.75 కోట్లతో హుసేనాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, రూ.4.75 కోట్లతో ఓర్వకల్లు సామాజిక ఆరోగ్య కేంద్రంలో వసతులు కల్పించింది. పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి చొరవతోనే 8 పడకల ఆసుపత్రిగా ఉన్న ఓర్వకల్లు సామాజిక ఆరోగ్య కేంద్రం నేడు 30 పడకల ఆసుపత్రిగా మారింది.

తల్లీ బిడ్డల ఆరోగ్యానికి భరోసా



ఆసుపత్రిలో బిడ్డకు వెచ్చదనాన్ని ఇస్తున్న రేడియల్ వార్మర్

సామాజిక ఆరోగ్య కేంద్రంలో తల్లీ బిడ్డల ఆరోగ్యాలకు మరింత మరింత భరోసా కల్పిస్తారు. ఆసుపత్రిలో చిల్ల పిల్లలకు, స్త్రీలకు, పురుషులకు వేర్వేరుగా వార్డులను కేటాయించారు. చిన్న పిల్లల వార్డులో పుట్టిన బిడ్డకు వెచ్చదనం కోసం 24 గంటల పాటు రేడియల్ వార్మర్ ద్వారా వెచ్చదనం కల్పించే యంత్ర సదుపాయం అందుబాటులో ఉంది. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి వైద్యాధికారి పర్యవేక్షణలో జనరల్ మెడిసిన్, జనరల్ సర్జన్, పీడియాట్రిక్, గైనకాలజిస్టు, అనస్తీయాటిస్ట్ వంటి ఐదుగురు వైద్య నిపుణులు ఉన్నారు. దంత వైద్యులు అందుబాటులో ఉన్నారు. వీరేగాక ఒక హెడ్ నర్సుతో పాటు, ఆరుగురు స్టాఫ్ నర్సులు, మరో ఆరుగురు జీడీఏ(జనరల్ డ్యూటీ అటెండెంట్లు) 24 గంటలు రోగులకు అందుబాటులో ఉంటున్నట్లు వైద్యాధికారులు పేర్కొంటున్నారు.

కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేశారు



మాది బేతంచెర్ల మండలం రుద్రవరం గ్రామం. మా ఆడపడుచు చిన్న మద్దమ్మ రెండు సార్లు కర్నూలులో ప్రసవించింది. మూడో కాన్పుకు ఓర్వకల్లుకు తీసుకొచ్చాం. ఇక్కడ వైద్యులు సురక్షితమైన ప్రసవం చేసి, కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేశారు. ప్రస్తుతం తల్లీ బిడ్డలు ఇద్దరు క్షేమంగా ఉన్నారు. – డి.లక్ష్మీదేవి

సిజేరియన్‌తో కాన్పు చేశారు



మా సొంతూరు గూడూరు మండలం పులకుర్తి. కొన్నిరోజులుగా బదుకుదెరవు కోసం సోలార్ పరిశ్రమలో వలస కూలీలుగా పనిచేస్తున్నాం. మా తోడు కోడలు సోనీకి అనుకోకుండా పురిటి నొప్పులు రావడంతో కర్నూలుకు వెళ్లలేక ఓర్వకల్లు ఆసుపత్రికి తీసుకొచ్చాం. ఇక్కడ వైద్యులు అన్ని రకాల జాగ్రత్తలతో సిజేరియన్ చేసి బిడ్డను బయటకు తీశారు. ప్రస్తుతం ఇద్దరూ ఆరోగ్యంగా ఉన్నారు. – సుంకులమ్మ

మెరుగైన వైద్య సేవలు అందిస్తాం



ఆసుపత్రికి వచ్చిన రోగులకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాం. శస్త్ర చికిత్సలు అవసరమైన సదుపాయాలు ఉన్నాయి. ఇక్కడికి వచ్చిన రోగులకు ముందుగా నిర్ధారణ పరీక్షలు నిర్వహించి, వైద్యం అందజేస్తాం. అవసరమైతే వ్యాధి తీవ్రతను బట్టి మెరుగైన వైద్యం కోసం సమీపంలోని కర్నూలు ఆసుపత్రికి రెఫరల్ చేస్తాం. ఆరోగ్యశ్రీ పరిధిలోగల అన్ని రకాల వైద్య సేవలు ఆసుపత్రిలో అందుబాటులో ఉన్నాయి.
– డా.మంజుల, వైద్యాధికారిణి, సీహెచ్‌సీ, ఓర్వకల్లు

అటవీ ఉద్యోగుల ఆరోగ్య రక్షణకు 'వన సంజీవని'

- జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.శ్రీనివాసులు



మాట్లాడుతున్న శ్రీనివాసులు

కర్నూలు కల్చరల్: అటవీ శాఖ ఉద్యోగుల ఆరోగ్య రక్షణ కోసం వనసంజీవని పథకం అమలులో ఉందని, దానిని సద్వినియోగం చేసుకోవాలని జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.శ్రీనివాసులు అన్నారు. ఆదివారం డీఎఫ్‌ఓ కార్యాలయం ఆవరణలో అసోసియేషన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వన సంజీవని పథకం ద్వారా ఆసుపత్రుల్లో వైద్య సేవలు ఉచితంగా అందుకోవచ్చన్నారు. పోలీస్ శాఖతో పాటు సమానంగా 15 ఈఎల్స్‌ను అటవీ శాఖ ఫీల్డ్ ఉద్యోగులకు పెంచాలని కోరారు. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్స్ పోస్టులను 85 శాతం ప్రమోషన్స్, 15 శాతం రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీ చేయాలన్నారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు శశిభూషణ్ యాదవ్, కోశాధికారి సురేష్, ఆర్గనైజింగ్ కార్యదర్శి విమల్ కుమార్, కర్నూలు డివిజన్ అధ్యక్షులు భాస్కర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మౌలాలి, కోశాధికారి కృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ అబ్దుల్ కలాం, జాయింట్ సెక్రటరీ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కర్నూలులో 8 నుంచి బాలోత్సవం



వేడుకల వివరాలను వెల్లడిస్తున్న కమిటీ ప్రతినిధులు

కర్నూలు కల్చరల్: నగరంలో బాలోత్సవాన్ని ఈనెల 8, 9 తేదీల్లో నగర శివారులోని ఇండస్ పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు బాలోత్సవ్ కమిటీ అధ్యక్షులు బడేసాహెబ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి కెంగార మోహన్ తెలిపారు. ఆదివారం సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వేడుకల వివరాలను వెల్లడించారు. వేడుకలు రెండు రోజుల పాటు జరుగుతాయన్నారు. మొత్తం 12 ఈవెంట్లు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మొదటి రోజు వేడుకలను జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన, రెండో రోజు వేడుకలను విద్యా శాఖ జాయింట్ డైరెక్టర్ మువ్వా రామలింగం ప్రారంభిస్తారన్నారు. కమిటీ ఉపాధ్యక్షులు పత్తి ఓబులయ్య, ప్రధాన కార్యదర్శి జీఎన్ శేషయ్య మాట్లాడుతూ.. నృత్యం, సంగీతం, చిత్రలేఖనం, వక్తృత్వం, వ్యాసరచన పోటీలు ఉంటాయన్నారు. సమావేశంలో ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి ఎం.పి. బాలరాజు, యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు సురేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

విషపూరిత మాంసం తిని కుక్కలు మృతి

కొత్తపల్లి: విషపూరితమైన మాంసం తినడంతో అధిక సంఖ్యలో కుక్కలు మృతి చెందిన ఘటన జడ్‌వారిపల్లెలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల తెలిపిన వివరాల మేరకు గ్రామంలోని ఓ వ్యక్తికి చెందినగొర్రె మృతిచెందింది. మృతిచెందిన గొర్రె కళేబరాన్ని ఊరి చివర పడేశారు. గ్రామంలోని వీధి కుక్కలు గొర్రె కళేబరాన్ని తినడంతో శనివారం రాత్రి తిన్న నాటి నుంచి ఒక్కొక్కటిగా ఉన్నట్టుండి మృత్యువాత పడుతున్నాయి. ఆదివారం నాటికి మృతి చెందిన కుక్కల సంఖ్య 30కి చేరుకుంది. చనిపోయిన గొర్రె మాంసం తినడం వలన కుక్కలు మృత్యువాత పడుతున్నాయని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. కాగా గుర్తు తెలియని వ్యక్తులు కుక్కలపై విష ప్రయోగానికి పాల్పడ్డారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

విద్యార్థుల భవిష్యత్తుకు 'నవోదయ'ం

- ఈనెల 10న, 9వ, 11వ తరగతులకు ప్రవేశ పరీక్ష
- 7 కేంద్రాల్లో పరీక్షల నిర్వహణ



బనవాసి నవోదయ విద్యాలయ ముఖద్వారం

ఎమ్మిగనూరురూరల్: జవహర్ నవోదయ విద్యాలయంలో ఒక్క సారి సీటు సంపాదిస్తే విద్యార్థి ఉజ్వల భవిష్యత్తుకు పునాది పడినట్లే. ప్రతిభావంతులైన విద్యార్థులకు అధిక ప్రాధాన్యం ఇస్తూ ఉన్నత ప్రమాణాలతో జవహర్ నవోదయ విద్యాలయాలు విద్యను అందిస్తున్నాయి. 1986లో జాతీయ విద్యా విధానాన్ని అనుసరించి భారత ప్రభుత్వం ఈ విద్యాలయాలను ప్రారంభించింది. 2024–2025 విద్యా సంవత్సరంలో నవోదయలో 9వ, 11వ తరగతిలో ప్రవేశానికి ఈ నెల 10 వ తేదీన ప్రవేశ పరీక్షను నిర్వహిస్తున్నారు. 9వ తరగతిలో 7 ఖాళీలకు 1,502 మంది, 11వ తరగతిలో ఖాళీలకు 1,595 మంది దరఖాస్తులు చేసుకున్నారు. రెండు పరీక్షలకు ఒకే రోజు ప్రవేశ ఉంటుంది.

ఉచిత విద్య...ఉపకార వేతనం

ప్రభుత్వం, ప్రభుత్వ ఆమోదిత, ఎయిడెడ్ పాఠశాలల్లో ఈ ఏడాది 10వ తరగతి చదువతున్న వారి నుంచి 2024–2025 విద్యా సంవత్సరానికి 11వ తరగతిలో ప్రతిభ, రిజర్వేషన్ల ప్రాతిపదికన ఎంపీసీ(కంప్యూటర్), బైపీసీ తదితర కోర్సుల్లో ఎంపిక ఉంటుంది. ఎంపికైన వారికి నాణ్యమైన భోజనం, వసతితో పాటు 11వ తరగతి ప్రారంభం నుంచే అవంతి పౌండేషన్, టాటా మోటార్ కంపెనీ ప్రోత్సహంతో నిపుణులైన అధ్యాపకులచే నీట్, ఎంసెట్ ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. 12వ తరగతిలో 'విజ్ఞాన జ్యోతి' పథకం కింద ప్రతి విద్యార్థికి రూ. 1000 చొప్పున ఉపకార వేతనంతో పాటు నీట్, ఎంసెట్‌కు సంబంధించిన మెటీరియల్ ఉచితంగా అందజేస్తారు.

తీవ్రమైన పోటీ...

బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో 9వ తరగతిలో 7 ఖాళీలకు ప్రస్తుతం 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు 1,502 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. 9వ తరగతిలో ప్రవేశం పొందిన విద్యార్థులకు విద్యాలయంలో 12వ తరగతి వరకు నాణ్యమైన విద్య అందనుంది. వసతితో పాటు అన్ని రంగాల్లో వారిని తీర్చిదిద్దుతారు. జిల్లా మెరిట్‌ను పరిగణనలోకి తీసుకొని విద్యాలయంలో సీట్లను భర్తీ చేస్తారు. ఆ తర్వాత రాష్ట్ర మెరిట్ ఆధారంగా రాష్ట్రంలోని వివిధ నవోదయ విద్యాలయల్లో సీట్లను భర్తీ చేస్తారు. 11వ తరగతిలో ఖాళీలతో పాటు ప్రతి విద్యాలయంలో 40 సీట్లు మాత్రమే ఉండగా ఈ సంవత్సరం నుంచి 80కి పెంచింది.

పరీక్ష కేంద్రాలు

9వ, 11వ తరగతిల్లో ప్రవేశానికి ఒకే రోజు పరీక్ష ఉంటుంది. 9వ తరగతికి ఉదయం 11.15 నుంచి 1.45 వరకు మూడు కేంద్రాల్లో పరీక్ష ఉంటుంది. అలాగే 11వ తరగతికి ఉదయం 11 గంటల నుంచి 1.30 వరకు 4 కేంద్రాల్లో పరీక్ష ఉంటుంది.

ఆబ్జెక్టివ్ ప్రశ్నలు: 11వ తరగతికి ఐదు విభాగాల్లో మెంటలెబులిటీ, ఇంగ్లిష్, సైన్సు, గణితం నుంచి 100 ప్రశ్నలు 100 మార్కులకు ఆబ్జెక్టివ్ టైపులో ఉంటాయి. అలాగే 9వ తరగతికి నాలుగు విభాగాల్లోని హిందీ, ఇంగ్లిష్, గణితం, జనరల్ సైన్సు నుంచి 100 ప్రశ్నలు 100 మార్కులు ఆబ్జెక్టివ్ టైపులో ఉంటాయి. రెండు పరీక్షలకు నెగటివ్ మార్కులు ఉండవు.

హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోండి

ఈనెల 10న జరిగే ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు హాల్‌టికెట్లను https://navodaya.gov.inwww.nvsadmisspnclassnine.in నుంచి పొందవచ్చు. సందేహాలకు 08512–29454, 8074952380, 9985738899 నంబర్లకు ఫోన్ చేయవచ్చు.

అత్యుత్తమ ప్రమాణాలు సాధించడమే లక్ష్యం



విద్యాలయంలో అత్యుత్తమ విద్యాప్రమాణాల సాధన లక్ష్యంగా పటిష్ట విద్యా ప్రణాళికలు అమలు చేస్తున్నాం. రిజర్వేషన్ల ప్రాతిపదికన 9వ, 11వ తరగతల్లో సీట్లను భర్తీ చేస్తాం. పైరవీరకు తావు ఉండదు. విద్యార్థులు కష్టపడి చదివితే సీటును సంపాదించుకోవచ్చు.
– ఇ.పద్మావతి, ప్రిన్సిపాల్, బనవాసి నవోదయ

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



బదిలీపై వెళ్తున్న ఏఎస్పీ వెంకటరాముడును సన్మానిస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి తదితరులు

బొమ్మలసత్రం: శిక్షణ కార్యక్రమాలను జిల్లా సాయుధ బలగాలు సద్వినియోగం చేసుకుని మంచి పేరు తీసుకురావాలని జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి సూచించారు. ఆదివారం సాయంత్రం స్థానిక కార్యాలయ ఆవరణలో అధికారుల బదిలీ సందర్భంగా ఏర్పాటు చేసిన వీడ్కోలు కార్యక్రమానికి ఎస్పీ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జిల్లా నుంచి ఇతర ప్రాంతాలకు బదిలీ అయిన అడిషనల్ ఎస్పీ వెంకటరాముడుతో పాటు ముగ్గురు డీఎస్పీలు తదితర సిబ్బందిని ఎస్పీ సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నూతన జిల్లాగా నంద్యాల ఏర్పాటైనప్పటి నుంచి బదిలీపై వచ్చిన అధికారులు ఎంతో ఓర్పుతో వారి విభాగాలకు మంచి పేరుతెచ్చిపెట్టారని వివరించారు. ఏఆర్ సిబ్బంది ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలవలే విపత్కర సమయాల్లో ప్రజలను రక్షించేలా శిక్షణ పొందాలన్నారు. ఏఆర్ అడిషనల్ ఎస్పీ చంద్రబాబు, డీఎస్పీలు మహేశ్వరరెడ్డి, శ్రీనివాసరావు, వెంకటరామయ్య, శ్రీనివాసరెడ్డి, సంతోష్, మారుతీరావు, రంగముణి తదితరులు పాల్గొన్నారు.

రూ. 13 లక్షల నగదు సీజ్



వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

నందికొట్కూరు రూరల్: అంతర్ జిల్లా చెక్ పోస్టు వద్ద రూ. 13 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు బ్రాహ్మణకొట్కూరు ఎస్‌ఐ నాగార్జున తెలిపారు. సాధారణ ఎన్నికల సందర్భంగా వాహనాల తనిఖీ చేస్తుండగా డోన్ పట్టణానికి చెందిన శ్రీనివాస్ గౌడ్ అనే వ్యక్తి కారులో రూ. 13 లక్షలు బయటపడ్డాయని, నగదుకు సంబంధించి ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో నగదను ఇన్‌కం ట్యాక్స్ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు. త్వరలో విడుదలై సినిమాల ప్రదర్శన నిమిత్తం నందికొట్కూరులో అడ్వాన్స్ ఇచ్చేందుకు వెళ్తుండగా నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. నగదు స్వాధీనంలో నందికొట్కూరు డిప్యూటీ తహసీల్దార్ సోమేశ్వర్ దేవి, వీఆర్వో, సిబ్బంది పాల్గొన్నారు.

కంబదహాల్‌లో రెండు ఇళ్లలో చోరీ



బీరువా పగులగొట్టిన దృశ్యం

సి.బెళగల్: మండల పరిధిలోని కంబదహాల్ గ్రామంలో రెండు ఇళ్లలో చోరీ జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. బంధువులు ఆరోగ్య సమస్యలతో ఆసుపత్రిలో చేరడంతో కుటుంబ సభ్యులతో కలిసి వెంకటరామిరెడ్డి, ప్రతాప్‌రెడ్డి శుక్రవారం కర్నూలుకు వెళ్లారు. ఇదే అదనుగా భావించిన దొంగలు రెండు ఇళ్ల తలుపులు పగులగొట్టి, బీరువాలను ధ్వంసం చేసి బంగారు నగలు, డబ్బులను దోచుకెళ్లారు. ఆదివారం ఉదయం బాధితుల ఇళ్లు తెరి ఉండటాన్ని గమనించి స్థానికులు సమాచారం ఇచ్చారు. దీంతో వారు వచ్చి చోరీ జరిగిందని నిర్ధారించుకున్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేశారు. వెంకటరామిరెడ్డి ఇంట్లో ఐదు తులాల బంగారు గాజులు, రెండు తులాల పారల బంగారు చైను, రూ.3 లక్షల నగదును, ప్రతాప్‌రెడ్డి ఇంట్లో రెండు తులాల బంగారు ఆభరణాలు, రూ.10 వేల నగదు చోరీ జరిగినట్లు ఫిర్యాదులో బాధితులు పేర్కొన్నారు. గ్రామంలో విచారణ చేపట్టినట్లు ఎస్‌ఐ మన్మథ్‌విజయ్ తెలిపారు.

దూసుకొచ్చిన మృత్యువు

- రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి. మరొకరికి తీవ్రగాయాలు
- హులేబీడు గ్రామంలో విషాదం



చిన్నమోదీన్ (ఫైల్)

ఆలూరు రూరల్: కారు రూపంలో మృత్యువు దూసుకొచ్చింది. కాలకృత్యాలు ముగించుకుని రోడ్డు పక్కన నిల్చున్న బాలుడిని బలితీసుకుంది. ఈ దుర్ఘటన హులేబీడు గ్రామ సమీపంలో ఆదివారం ఉదయం 6.30 గంటలకు చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. హులేబీడు గ్రామానికి చెందిన చిన్న బాబయ్య, మునెమ్మల ఏకైక కుమారుడు చిన్న మోదీన్ (12), మల్లికార్జున, రాములమ్మల కుమారుడు గణేష్ మంచి స్నేహితులు. ఇద్దరూ ఆదివారం ఉదయం గ్రామంలోని హైవే 167 రహదారిలోని ఆంజినేయ స్వామి దేవాలయం సమీపంలో సైకిల్‌పై బహిర్భూమికి వెళ్లారు. కాలకృత్యాలు ముగించుకుని రోడ్డు పక్కన సైకిల్ ఆపుకుని మాట్లాడుకుంటుండగా.. రాయచూర్ నుంచి బళ్లారి వైపు వెళుతున్న కారు (కేఏ 35 డి 3147) అతివేగంగా వచ్చి విద్యార్థులిద్దరినీ బలంగా ఢీకొట్టింది. ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు గమనించి చిన్నారులిద్దరినీ ఆటలో ఆదోని ఆస్పత్రికి తరలిస్తుండగా చిన్నమోదీన్ (12) మార్గమధ్యలో తుది శ్వాస విడిచాడు. తీవ్రగాయాలైన గణేష్‌ను ఓ ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. చిన్నమోదీన్ హులేబీడు ప్రభుత్వ పాఠశాలలో 6వ తరగతి, గణేష్ 7వ తరగతి చదువుతున్నాడు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్, కారును అదుపులో తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఓబులేసు విలేకరులకు తెలిపారు.

బాల్కనీ నుంచి పడి మహిళ మృతి

కర్నూలు: కల్లూరు మండలం వీకర్ సెక్షన్ కాలనీలో నివాసం ఉంటున్న లలితమ్మ (39) బాల్కనీపై నుంచి పడి మృతి చెందింది. భర్త వదిలేయడంతో ఈమె కొన్నేళ్లుగా తమ్ముళ్ల వద్దనే ఉంటోంది. ఆదివారం ఉదయం బాత్‌రూమ్ కోసం మిద్దెపైకి ఎక్కి బాల్కనీలో నిలబడి ఉండగా అదుపు తప్పి కింద పడి మృతి చెందింది. విషయం తెలుసుకున్న నాలుగో పట్టణ పోలీసులు ఘటనపై విచారణ జరుపుతున్నారు.

ఆటో బోల్తా .. తొమ్మిది మందికి గాయాలు

వజ్రకరూరు/చిప్పగిరి: అనంతపురం జిల్లా వజ్రకరూరు మండలంలోని గూళ్యపాళ్యం సమీపంలో ఆదివారం సాయంత్రం ఆటో బోల్తాపడింది. ఈ ఘటనలో ఆటోలో ఉన్న ఆరుగురికి గాయాలు కాగా మరో ముగ్గురు చిన్నారులకు స్వల్ప గాయాలయ్యాయి. కర్నూలు జిల్లా చిప్పగిరి మండలం నేమకల్లు గ్రామానికి చెందిన హేమలత, సుకన్య, భాస్కర్, మరో ఐదుగురు గ్రామ వలంటీర్లు, ముగ్గురు చిన్నారులు ఆదివారం ఆటోలో గుంతకల్లు నుంచి పెన్నహోబిలం వెళ్లారు. సాయంత్రం తిరిగి గుంతకల్లుకు వస్తుండగా మార్గమధ్యం గూళ్యపాళ్యం వద్ద ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. ఘటనలో తొమ్మిది మంది గాయపడ్డారు. గుంతకల్లు, వజ్రకరూరు మండలాలకు చెందిన 108 వాహనాలు సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను గుంతకల్లు ప్రభుత్వాస్పత్రికి తరలించాయి.